
సాక్షి
పల్నాడు
ఆదివారం । 13 । జూలై । 2025



20న మహంకాళీ బోనాల ఉత్సవాలు

దుగ్గిరాల: కంతంరాజు కొండూరులో గల మహంకాళీ అమ్మవారికి 20న బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నారు. మంత్రులు నారా లోకేష్, ఎ.రామనారాయణరెడ్డి పాల్గొంటారు.



వెండి బిస్కెట్ల సమర్పణ

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి కందుకూరుకు చెంది న తాళం నితిన్‌కుమార్ కుటుంబ సభ్యులు 2.3 కిలోల వెండి బిస్కెట్లను శనివారం సమర్పించారు.



సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఏపీ ఈఏపీసెట్–2025(ఎంపీసీ స్ట్రీమ్) పరీక్షలో ర్యాంకులు పొందిన స్పెషల్ కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ శనివారం ప్రారంభమైంది.

న్యూస్‌రీల్

పులిచింతలకు 20,077 క్యూసెక్కులు విడుదల



సత్రశాల (రెంటచింతల): సత్రశాల వద్ద కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రెండు యూనిట్ల నుంచి, రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా మొత్తం 20,077 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు ఏపీ జెన్‌కో ప్రాజెక్టు డ్యామ్ ఈఈ సుబ్రమణ్యం, ఏడీఈ ఎన్.జయశంకర్ శనివారం తెలిపారు. విద్యుత్ ప్రాజెక్టులోని రెండు యూనిట్ల ద్వారా 8,757 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతలకు విడుదల చేసి 1.874 ఎంఎం విద్యుత్ ఉత్పత్తి నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు 2 క్రస్ట్‌గేట్ల ద్వారా 11,320 క్యూసెక్కులు వరద నీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నీటిమట్టం ప్రాజెక్టు పూర్తి స్థాయి 75.50 మీటర్లకు నీరు చేరుకుందని, రిజర్వాయర్‌లో గరిష్ట స్థాయిలో 7.080 టీఎంసీలు నిల్వ ఉందని తెలిపారు.

గుంటూరు నగరపాలక సంస్థకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డ్

నెహ్రూనగర్ : కేంద్ర ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో శనివారం ప్రకటించిన సర్వేక్షణ్ అవార్డుల్లో గుంటూరు నగరం స్థానం సాధించిందని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీస్ విభాగంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు ఎంపిక అయ్యాయని పేర్కొన్నారు. ఇందులో 3 నుంచి 10 లక్షల జనాభా ఉన్న నగరాల్లో గుంటూరు నగరం స్థానం దక్కించుకుందని వెల్లడించారు. న్యూ ఢిల్లీలోని విద్యా భవన్‌లో ఈ నెల 17న రాష్ట్రపతి అవార్డ్‌లను అందిస్తారని, తనతో పాటు మేయర్ వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో నగరం నిలవడానికి కృషి చేసిన ప్రజారోగ్య సిబ్బంది, అధికారులు, ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ కార్యవర్గం ఎన్నిక



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ (జీటీఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎంఎం షరీఫ్, డి.యల్లమందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాత గుంటూరులోని పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన జీటీఏ ఉమ్మడి గుంటూరుజిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధికారిగా రమాదేవి, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా చలపతిరావు, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏ.విజయకుమార్, సంయుక్త కార్యదర్శిగా పి.రమేష్‌బాబు, బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏ.దశరథ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ప్రశాంత్ బాబు నియమితులయ్యారు.

ఇసుక అక్రమ తవ్వకాలను సహించం

మంత్రి మనోహర్



కొల్లిపర: ఇసుక అక్రమ తవ్వకాలను సహించేది లేదని, సొంత పార్టీ వాళ్లయినా అక్రమానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కృష్ణానది నుంచి ఇసుక తరలింపులో అక్రమాలు జరుగుతున్నాయని ఆయన దృష్టికి రావడంతో శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ప్రారంభంలో ఇసుక నిల్వ.. ప్రస్తుతం అనే అంశాలపై రేపటిలోగా తనకు నివేదికను అందించాలని ఆదేశించారు. నదిలో అర్ధరాత్రి మిషన్లతో తవ్వకాలు జరుగుతున్నారని తనకి సమాచారం వచ్చిందని, దీనిపై సమాధానం చెప్పాలని రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులను ఆయన ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోయేసరికి వారిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ తవ్వకాలు విషయం తేలే వరకు డంపింగ్ యార్డ్ నుంచి ఇసుకను తరలించవద్దని అధికారులను ఆదేశించారు.

అధికారం అండగా

అక్రమ క్వారీయింగ్

మైనింగ్ క్వారీలు నడపాలంటే మైనింగ్ శాఖ, పర్యావరణ(ఈసీ), కాలుష్య నియంత్రణ మండలితోపాటు సీఎఫ్‌ఈ, సీఎఫ్‌వో వంటి అనుమతులు తీసుకోవాలి. ఆ తర్వాత రవాణాకు సంబంధించిన పర్మిట్లు తీసుకుని, తవ్విన ఖనిజం తరలించాలి. కానీ ఇవేమి లేకుండానే అధికార పార్టీ నేతల అండదండలతో కొండలు, గుట్టలను గుట్టు చప్పుడు కాకుండా తవ్వేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టాన్ని కలిగించడమే కాకుండా, పర్యావరణ విపత్తుకు ఇది దారితీస్తోంది.

- మండలంలో మొత్తం 37 క్వారీలు
- అనుమతులు లేనివే అత్యధికం
- కంకర క్వారీల్లో నిబంధనల ఉల్లంఘన
- అధికార పార్టీ నేతల అండదండలు
- తవ్వకాలు ఆపాలంటూ ఉప్పరపాలెం గ్రామస్తుల వేడుకోలు
- కలెక్టర్ ఆదేశాలతో క్వారీల్లో సమగ్ర తనిఖీలు
- అక్రమ మైనింగ్‌తో ప్రభుత్వానికి భారీ నష్టం



ఉప్పరపాలెంలో క్వారీ కొండలు



విచారణ జరుపుతున్న ఆర్డీఓ మధులత(ఫైల్)

యడ్లపాడు: యడ్లపాడు మండలం వంకాయలపాడు రెవెన్యూ పరిధిలోని ఉప్పరపాలెంలో అక్రమ మెటల్ క్వారీయింగ్‌పై గ్రామస్తులు ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రమాద హెచ్చరికలు తెలిపే భద్రతా బోర్డులు, ఫెన్సింగ్ లేకుండా కొండలు తవ్వడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ బ్లాస్టింగ్‌తో నివాసాలపై రాళ్లుపడుతున్నాయని, పర్యావరణం, భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని, దుమ్ముధూళితో పంట పొలాలు పాడవుతున్నాయని, క్వారీ గుంతల్లో వర్షపు నీరు నిలిచి ప్రజలు, పశువులు ప్రమాదాల బారినపడే పడుతున్నారని, భారీ లోడు వాహనాల కారణంగా రోడ్లు ధ్వంసమవుతున్నాయంటూ స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదుతో అధికారుల్లో చలనం

ఉప్పరపాలెం గ్రామస్తుడు గుంజి శ్రీనుతోపాటు మరికొందరు కలెక్టర్‌కు గతనెల 26న ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల రెండో తేదీన నరసరావుపేట ఆర్డీఓ మధులత క్షేత్రస్థాయి విచారణకు ఉప్పరపాలెం వచ్చారు. కొండల్లో ఉన్న లీజుదారుల క్వారీలన్నింటిని సమగ్ర సర్వే చేయాలంటూ ఆదేశించారు. దీంతో మూడు రోజులపాటు మైనింగ్, రెవెన్యూ, పంచాయతీ, పోలీసుశాఖల అధికారులు, గ్రామస్తుల సమక్షంలో కొలతలు చేపట్టారు. అనేక అక్రమ క్వారీయింగ్ విషయాలు బయటపడ్డాయి.

క్వారీలు 26..అనుమతులు నాలుగింటికే..

మండలం పరిధిలోని విశ్వనాథుని కండ్రిక, మైదవోలు, వంకాయలపాడు రెవెన్యూ కొండల్లో మొత్తం 37 క్వారీలు ఉన్నాయి. వీటిలో యడ్లపాడు–11, ఉప్పరపాలెం–26 క్వారీ లీజులున్నాయి. గతంలో ఉన్న క్వారీ లీజులు మైదవోలు–3, యడ్లపాడు–1 రద్దు కాగా, వాటికి బదులుగా యడ్లపాడు–1, ఉప్పరపాలెం–3 కొత్త లీజుదారులు వచ్చారు. ఈ నేపథ్యంలో ఉప్పరపాలెం గ్రామంలోని సర్వే నంబర్ 240/10 పరిధిలో ఉన్న 26 లీజుల్లో 4 క్వారీలకు మాత్రమే అన్ని అనుమతులు ఉన్నట్లు తాజాగా ఉమ్మడి శాఖల అధికారుల విచారణలో వెలుగుచూసింది.

ప్రభుత్వ ఆదాయానికి గండి ఇలా...

క్వారీల్లోని బండరాళ్లను టిప్పర్లలో స్టోన్ క్రషర్లకు తరలించి 12 ఎంఎం, 20ఎంఎం, 40 ఎంఎం సైజుల్లో ముక్కలుగా మారుస్తారు. రాతి డస్ట్‌గా ప్రాసెసింగ్ చేసుకుని వాటిని విక్రయించుకుంటారు. ఒక రోజుకు స్థానిక సుమారు రూ.12 లక్షల విలువైన 800 యూనిట్లు కంకర, 100 లారీలు డస్ట్ విక్రయాలు జరుగుతున్నటుల్ స్థానికులు చెబుతున్నారు. మామూళ్ల వసూళ్లు, నేతల సిఫార్సులతో రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి ఇలా గండి పడుతుంది.



తక్కెళ్లపాడులో కూటమి నేతల పేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్న ప్రభుత్వ భూమి

దాచేపల్లిలో భూ దందా

- ప్రభుత్వ భూములపై టీడీపీ నేతల కన్ను
- 27 ఎకరాల ప్రభుత్వ భూములు హాంఫట్
- ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్న నేతలు
- కోట్లు విలువచేసే భూములు నేతల చేతుల్లోకి..
- సహకరిస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- తాజాగా తహసీల్దార్ సస్పెన్షన్

సాక్షి టాస్క్‌ఫోర్స్: పల్నాడులో టీడీపీ నేతలు భూ దోపిడీకి పాల్పడుతున్నారు. గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రభుత్వ భూములను అందిన కాడికి దోచుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న ద్వితీయ శ్రేణి నాయకత్వం గ్రామాల వారీగా ప్రభుత్వ భూములను గుర్తించి రెవెన్యూ అధికారుల ద్వారా రికార్డులను తారుమారు చేసి లక్షలు పోగు చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయడం ఇప్పుడు పల్నాడు జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ వ్యవహారంలో కూటమి నేతలకు సహకరించిన అధికారులు సస్పెన్షన్‌కి గురైన పరిస్థితులు ఉన్నాయి. తాజాగా గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని దాచేపల్లిలో సుమారుగా 27 ఎకరాల ప్రభుత్వ భూములను టీడీపీ నేతలకు ధారాదత్తం చేసిన అప్పటి తహసీల్దారు వైవీబీ కుటుంబరావును జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయటంతో రెవెన్యూ అధికారులలో వణుకు మొదలైంది.



సస్పెన్షన్‌కి గురైన తహసీల్దార్ వైవీబీ(ఫైల్)

ఆన్‌లైన్‌లో టీడీపీ నేతల పేర్లు నమోదు

దాచేపల్లి మండలం కేసానుపల్లి రెవెన్యూ గ్రామంలో భారీ స్థాయిలో ప్రభుత్వ భూములను టీడీపీ నేతలకు కట్టబెట్టారు. సర్వే నెంబర్ 649/4బి2–బితోపాటు మరో సర్వే నెంబర్‌లో పిన్నబోయిన నాగరాజు పేరు మీద 8.22 ఎకరాలు, కిచ్చంశెట్టి పకీరయ్యతోపాటు మరో ఇద్దరిపై 15 సెంట్లు ఆన్‌లైన్‌లో ఎక్కించారు. తెలంగాణ రాష్ట్రంలోని ఇర్కిగూడెంకు చెందిన కోటిక కొండయ్య అతని భార్య వెంకటరమణ పేరు పై 6.79 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఇదే మండలంలోని గామాలపాడులో సర్వే నెంబర్ 348–15–7, 348–15–7లో భూమి కొనుగోలు చేసినట్లుగా నకిలీ రికార్డులు సృష్టించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేశారు. భట్రూపాలెంలో సమ్మెట శ్రీనివాసరాజు పేరుతో 5.5 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీటితో పాటుగా పెదగార్లపాడు, మాదినపాడు, గ్రామాల్లో కూడా ప్రభుత్వ, రాళ్లగుట్ట, వాగు పోరంబోకు భూములు కూటమి నేతలకు అప్పనంగా కట్టబెట్టారు. దాచేపల్లితోపాటుగా కారంపూడి, రెంటచింతల, మాచర్ల, వెల్దుర్తి, గురజాల, మాచవరం, పిడుగురాళ్ల, దుర్గి మండలాల పరిధిలో టీడీపీ నేతలు ప్రభుత్వ భూములపై కన్నేసి అక్రమంగా లాగేసుకుంటున్నారు.

అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

- పట్టణంలో ర్యాలీ నిర్వహించిన నాయకులు, కార్మికులు
- పట్టణ పౌరులు సహకరించాలంటూ కరపత్రాలు పంపిణీ



మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

నరసరావుపేట: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులందరూ శనివారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. ఇంజినీరింగ్ విభాగంలోని వాటర్, లైటింగ్ సెక్షన్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డ్రైవర్లు, పార్కు, ఫిల్టర్ హౌస్ వర్కర్లు, ట్యాంక్ వాల్ ఆపరేటర్లు (ఇండోర్, అవుట్‌డోర్) అందరూ నిరవధిక సమ్మెకు దిగారు. మున్సిపల్ కార్మికులు అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర డిమాండ్లను అమలు చేయాలని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు సీఐటీయూ నాయకులు, కార్మికులు శనివారం వినతిపత్రం అందజేశారు. తొలుత మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేసి కార్యాలయం వద్ద నుంచి మార్కెట్ మీదుగా మల్లమ్మ, శివుడి బొమ్మ, గడియారం స్తంభం సెంటర్ల మీదుగా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మూడు నెలలుగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని పలుమార్లు అధికారులు, మంత్రులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాని కారణంగా ఈ సమ్మెలోకి వెళుతున్నామని యూనియన్ నాయకులు షేక్ సిలార్ మసూద్, అల్లాభక్షు పేర్కొన్నారు. సమ్మె నోటీసు ఇచ్చినా కార్మిక నాయకులతో చర్చలు జరపకుండా ప్రభుత్వం నిమ్మకు నెరెత్తినట్టు వ్యవహరిస్తుందని విమర్శించారు. సమ్మె వల్ల ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని, ప్రజలు సానుకూలంగా స్పందించి మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలియజేయాలని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపునకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ వీధుల వెంట కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోమశేఖర్, కుంచాల శ్రీను, బాలాజీసింగ్, సకీలా శ్రీను, బత్తుల శ్రీను, కిరణ్‌కుమార్, మురళి, గుడా సామ్రాజ్యం, తీగల వెంకట్, గుంజి వాసు, షేక్ ఖాదర్, గౌస్, మాలిక్ ఎం సురేష్, రంగనాయకులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి కార్మెల్ మాత ఉత్సవాలు

- పెద్దఎత్తున భక్తుల రాక
- ఏర్పాట్లు పూర్తి



కార్మెల్ మాత స్వరూపం



కార్మెల్ మాత దేవాలయం

ఫిరంగిపురం: స్థానిక కార్మెల్‌కొండపై కొలువైఉన్న కార్మెల్ మాత ఉత్సవాలు ఈనెల 14,15,16వ తేదీల్లో నిర్వహించనున్నట్లు బాలఏసు దేవాలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి శనివారం తెలిపారు. ఉత్సవాలకు గుంటూరు జిల్లా మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య హాజరై, సమష్టి దివ్య పూజాబలి పూజల్లో పాల్గొంటారని చెప్పారు.

- 14న ఉదయం 5.30 గంటలకు బాల ఏసు దేవాలయంలో దివ్యపూజాబలి నిర్వహిస్తామన్నారు. సాయంత్రం కార్మెల్ మాత కొండ వద్ద ఫాదర్లు వై. అంథోనిరాజు, పి.జోజిరాజుల ఆధ్వర్యంలో దివ్య పూజా బలి కార్యక్రమాలు ఉంటాయి.
- 15న ఉదయం 8 గంటలకు, 12 గంటలకు ఫాదర్లు ఫాతిమా మర్రెడ్డి, బి.మరియ పవన్ కుమార్ ఆధ్వర్యంలో కొండపై దివ్య పూజాబలి ఉంటుంది. మధ్యాహ్నం సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో అన్నదానం, సాయంత్రం 5గంటలకు దివ్య సత్ప్రసాద ప్రదక్షిణ, ఆరాధన ఉంటుంది. దివ్య సత్ప్రసాదం, కార్మెల్‌మాత స్వరూపంతో బాల ఏసు దేవాలయం నుంచి కార్మెల్ మాత కొండ వరకు ప్రదక్షిణ నిర్వహిస్తారు. అఖండ జపమాలను మరియ దళ సభ్యులు పఠిస్తారు.
- 16న ఉదయం 6 గంటలకు దివ్య పూజాబలి పూజలు, అనంతరం తేరు ప్రదక్షిణ ఉంటుంది.

భక్తులకు సకల సదుపాయాలు

కార్మెల్ మాత ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి తెలిపారు. నీటి సదుపాయం, రెండురోజుల పాటు అన్నదానం, విశ్రాంతి గదులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

అన్ని వర్గాలను మోసం చేసిన బాబు



క్యూ ఆర్ కోడ్ ఉన్న పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మోదుగుల, మేరుగ, గౌతంరెడ్డి, గోపిరెడ్డి, నంబూరు

- వైఎస్సార్ సీపీ నేతలు
- సీఎం మోసాలను ఇంటింటికి తీసుకెళ్లాలి
- పెదకూరపాడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు

పెదకూరపాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మోసాన్ని ఇంటింటికి వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని ముఖ్యనేతలు పేర్కొన్నారు. గత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన నేడు చంద్రబాబు పాలనను బేరీజు వేసుకునేలా ప్రజల్లో ఆలోచింప చేయాలన్నారు. బాబు ష్యూరిటీ.–మోసం గ్యారంటీ, రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ క్రోసూరు మండల అధ్యక్షుడు వెలది అప్పారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, పల్నాడు జిల్లా పరిశీలకులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు చెన్నప్పరెడ్డి వెంకటేశ్వరెడ్డి, కొండవీటి కోటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మంగిశెట్టి కోటేశ్వరరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్ హష్మి, జెడ్పీటీసీ సభ్యులు వెంకటరెడ్డి, షేక్ జమీలా గఫూర్, కంకణాల స్వర్ణకుమారి, ప్రతాప్‌రెడ్డి, క్రోసూరు యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీలు బెల్లంకొండ మీరయ్య, పి.కోటయ్య, చెన్నప్పరెడ్డి పద్మా వెంకటేశ్వరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు చిలకా చంద్రయ్య, నర్సిరెడ్డి, భవిరిశెట్టి హనుమంతరావు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నంబూరు కృషి



మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన మోసాలను చూసి ఎన్టీఆర్ విగ్రహం తలదించుకుంటుందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధి కోసం శంకరరావు నిరంతరం కృషి చేశాడన్నారు. అమరావతి బెల్లంకొండ రహదారికి శంకరరావు రోడ్డు అని నామకరణం చేయాల్సిందేనని అన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన



మేరుగ నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన 145 వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దళిత బిడ్డలపై అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకోవటం లేదన్నారు. రాజ్యాంగాన్ని ఖూని చేసే విధంగా రెడ్‌బుక్ పాలన నడుస్తుందన్నారు.

కూటమి పాలనపై వ్యతిరేకత



గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనపై తీవ్ర వ్యతిరేకత మొదలైందని చంద్రబాబుకు తెలుసునని అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఈదా సాంబరెడ్డిని కాపు కాచి నడిరోడ్డు మీద రెండు కాళ్లు విరగొట్టటం దుర్మార్గమని అన్నారు. అక్రమంగా కేసులు పెట్టే పోలీసులపై చర్యలు తప్పవన్నారు. తల్లికి వందనం లోకేష్ మదిలో నుండి వచ్చిందని చెప్పటం చంద్రబాబు మోసాలకు నిదర్శనమన్నారు.

నవ రత్నాలు మావి..



నంబూరు శంకరరావు మాట్లాడుతూ జగన్న నవరత్నాల గురించి ప్రజలకు చెప్పుకునే దమ్ము, ధైర్యం మాకుందన్నారు. కూటమి ఏడాది పాలనలో చేసిందేమీ లేదని, సుపరిపాలన గురించి చెప్పుకోవటానికి ఇళ్లకు వెళ్లేందుకు కూడా భయపడుతున్నారు. తనపై వస్తున్న ఆరోపణలు నమ్మవద్దని, పెదకూరపాడు అభివృద్ధి ఆశయంగా పని చేస్తానని అన్నారు. రాబోయే రోజుల్లో తాను హామీ ఇచ్చిన అమరావతి–బెల్లంకొండ రోడ్డు, ఎత్తిపోతల పథకాలు పూర్తి చేస్తానని అన్నారు.

నిరుద్యోగ భృతి ఏమైంది?



గౌతంరెడ్డి మాట్లాడుతూ 20 లక్షల ఉద్యోగాలిస్తానన్నావ్.. నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తానన్నావ్..ఎక్కడిచ్చావు బాబూ అని ప్రశ్నించారు. జగన్ ముఖ్యమంత్రి అయిన ఏడాదికే నాలుగు లక్షల ఉద్యోగాలు ఇచ్చారన్నారు.

క్లుప్తంగా

ఇంటర్నేషనల్ డెలిగేట్‌గా న్యాయవాది వేణగోపాల్ ఎంపిక



సత్తెనపల్లి: ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ లాయర్స్ (ఐఏసీఎల్‌ఎస్) సెమినార్‌కు పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది నరిసేటి వేణుగోపాల్ డెలిగేట్‌గా ఎంపికయ్యారు. నేపాల్ రాజధాని ఖాట్మాండులో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న ఇంటర్నేషనల్ సెమినార్‌లో ప్రపంచ వ్యాప్తంగా న్యాయవ్యవస్థలో వస్తున్న మార్పులతోపాటు, పలు సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలు, న్యాయవాదుల రక్షణ, తదితర అంశాలపై సమీక్షలు జరిపి ఇంటర్నేషనల్ డిక్లరేషన్‌ను కాన్ఫరెన్సు ఆమోదించనుంది. సీనియర్ న్యాయవాది నరిసేటి వేణుగోపాల్‌ను పలువురు న్యాయవాదులు అభినందించారు.

గొట్టిపాళ్ల కూటమిలో భగ్గుమన్న వర్గపోరు

జనసేన నాయకుడు పోలకం రమేష్‌పై టీడీపీ నేతల దాడి



వెల్దుర్తి: గొట్టిపాళ్ల గ్రామంలోని కూటమి పార్టీల్లో వర్గ విబేధాలు భగ్గుమన్నాయి. జనసేన పార్టీ నాయకుడు పోలకం రమేష్‌పై టీడీపీకి చెందిన నక్కా శివరాజు, చిన ఏసురాజు, నక్కా పెద పాపయ్యలు రాడ్లు, కర్రలతో తీవ్రంగా శుక్రవారం రాత్రి తీవ్రంగా కొట్టారు. సేకరించిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గొట్టిపాళ్ల గ్రామంలో జనసేన నాయకుడు పోలకం రమేష్ తన స్నేహితులతో మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు ముగ్గురు రాడ్లు, కర్రలతో దాడి చేయటంతో తీవ్ర గాయాలయ్యాయి. తన అల్లుడు తనను ఇంటికి తీసుకెళ్తుండగా.. పై ముగ్గురితో పాటు మరో 10 మంది ఇంటిపై కూడా దాడి చేసి మహిళలను అసభ్య పదజాలంతో దూషించి, భయభ్రాంతులకు గురి చేశారని రమేష్ తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పదవుల పంపకాల్లో తమకు అడ్డుగా వస్తారనే ఉద్దేశ్యంతో టీడీపీ నేతలు తనపై దాడి చేశారని రమేష్ వాపోయాడు. గతంలోనూ తన అంతు చూస్తామని బెదిరించడంతో ఊరు వదిలి వేరే గ్రామంలో తలదాచుకుంటున్నానని వాపోయాడు. గాయపడిన రమేష్‌ను బంధువులు మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు రిఫర్ చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాల శాస్త్రవేత్తలను గుర్తిద్దాం

- ఇన్‌స్పైర్ మనక్ 2025-26 ప్రకటన జారీ
- సెప్టెంబరు 15 రిజిస్ట్రేషన్‌కు తుది గడువు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థుల్లో ఆలోచన శక్తిని పెంపొందించి, పరిశోధనల వైపు ఆసక్తి కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల పేరుతో విద్యార్థులను ప్రోత్సహిస్తుంది. పాఠశాల స్థాయి విద్య నుంచే విద్యార్థి పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించుకొని సమాజానికి అవసరమైన వస్తు సేవల ఆవిష్కరణకు దోహదపడేలా వారిని తీర్చిదిద్దటమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశ్యం. కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ స్కీమ్‌ను 2009-10 విద్యా సంవత్సరం నుంచి అమలులోకి తెచ్చింది. కేంద్ర మానవ వనరుల అభివద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ మరియు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది.

ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు...

దేశవ్యాప్తంగా 6 నుంచి 12 తరగతులు చదువుతున్న అన్ని యాజమాన్యాలలోని పాఠశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యాశాఖ పరిధిలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, ప్రైవేటు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ, గురుకుల పాఠశాలలు తదితర అన్ని పాఠశాలల్లో చదివే విద్యార్థులు పాల్గొనవచ్చు. మంచి ప్రాజెక్టు చేసిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. జిల్లా స్థాయి పోటీకి ఎంపికైన ప్రాజెక్ట్‌కు రూ.10వేలు ప్రోత్సాహకంగా అందిస్తుంది. జాతీయస్థాయి పోటీకి ఎంపికైన ప్రదర్శనకు రూ.25వేలు అందిస్తారు. ప్రతి పాఠశాల నుంచి 2 నుంచి 3 నామినేషన్‌లు పంపవచ్చు.



గత ఏడాది విద్యార్థుల ఇన్‌స్పైర్ ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు (ఫైల్)

ప్రాజెక్టుకు ఉండవలసిన లక్షణాలు

- తక్కువ ఖర్చులో చేయదగినదిగా ఉండాలి
- పర్యావరణ హితం
- ఎక్కువమందికి ప్రయోజనకారి
- సులభతర నిర్వహణ విధానం
- మెరుగైన పనితీరు
- సృజనాత్మకత కలిగి ఉండాలి
- స్థానిక సమస్యను పరిష్కరించేదిగా ఉండాలి

వెబ్ సైట్‌లో నమోదు ఎలా?

ప్రదర్శనకు సిద్ధపడే విద్యార్థులు ముందుగా www.inspiremanakdst.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. విద్యార్థి సమాచారంతోపాటు అతని బ్యాంక్ ఎకౌంటు, ఆధార్ నంబరు నమోదు చేయాలి. ఎంచుకున్న ప్రాజెక్టు గురించి 300 పదాలలోపు సంక్షిప్త వివరణ నమోదు చేయాలి. ముందుగా పాఠశాల స్థాయిలో విద్యార్థుల మధ్య పోటీ నిర్వహించి ఉత్తమంగా ఎంపికైన నమూనాను పాఠశాల నుంచి పోటీకి పంపవలసి ఉంటుంది. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సెప్టెంబర్ 15 తేదీ తుది గడువు.

సృజనాత్మకతను వెలికితీసే వేదిక



విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్ మనక్ చక్కని వేదిక. ఈ పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనేలా ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలి. ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు ప్రాజెక్టులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. విద్యార్థి ఆలోచనలకు పదును పెట్టేలా సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలి. జిల్లా నుంచి అధికంగా నామినేషన్‌లు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలి. - ఎల్.చంద్రకళ, జిల్లా విద్యాశాఖాధికారి

పరిశోధనలపై ఆసక్తి పెంచేందుకు..



విద్యార్థులలో అంతర్గతంగా ఉన్న సామర్థ్యాలను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులకు ఇదొక అవకాశం. పాఠశాల స్థాయి నుంచే వారిలో పరిశోధనలపై ఆసక్తిని పెంచేందుకు సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలి. అందుకు ఇన్‌స్పైర్ మనక్ దోహదపడుతుంది. విద్యార్థుల నుంచే స్థానిక సమస్యలను గుర్తింప చేసి వారి ద్వారానే వాటికి పరిష్కారాలను కనుగొనేలా ప్రోత్సహించాలి. - ఎస్.రాజశేఖర్, జిల్లా సైన్స్ అధికారి

జిల్లాలో వర్షపాతం అంతంత మాత్రమే

నరసరావుపేట: ఈ నెలలో జిల్లాలో వర్షపాతం ఇప్పటి వరకు అంతంత మాత్రంగానే నమోదైంది. ఎండలు వేసవిని తలపించేలా కాస్తున్నాయి. ఎండలు బాగా కాయాల్సిన సమయం మే నెలలో వర్షాలు జోరుగా పడ్డాయి. కురవాల్సిన జూన్, జూలైలలో వర్షాలు మందగించాయి. రోజూ అక్కడక్కడా వర్షం పడుతున్నా అది కేవలం స్వల్పమే అవుతుంది. గడిచిన 24గంటల వ్యవధిలో 26.6 మి.మీ వర్షం పడింది. జిల్లాలోని 28 మండలాల్లో ఈ 12రోజుల వ్యవధిలో 1419.4 మిల్లీమీటర్లు వర్షం పడాల్సివుండగా కేవలం 302.0మి.మీ వర్షమే కురిసింది.

మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి

వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



పిడుగురాళ్ల: కూటమి ప్రభుత్వ హయాంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. శనివారం పిడుగురాళ్లలోని తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడు రంగరాయ కాలేజ్ ఆసుపత్రిలో జరిగిన చర్యకు ప్రతి ఒక్కరూ సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తుందన్నారు. కాలేజీ ఆసుపత్రిలో విద్యార్థునులపై వేధింపులు అత్యంత దారుణమన్నారు. ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుండం వలనే మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు. ఎవరో ఒకరు రఫా రఫా అని పోస్టర్ పెట్టారని తాట తీస్తాం, తోలు వలుస్తామంటూ పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నారని, అయితే మహిళలు, విద్యార్థినులపై నిత్యం జరుగుతున్న లైంగికదాడులు, అఘాయిత్యాలపై నోరు మెదపకపోవడం విడ్డూరమన్నారు.

పిల్లేరు కట్టనూ వదలని టీడీపీ నేతలు

- అక్రమ మట్టి విక్రయాల కోసం వాగు మొత్తం తవ్వేశారు
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిల్లేరు వాగు కట్టను పరిశీలించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్లరూరల్: మట్టి అక్రమ విక్రయాల కోసం పిల్లేరు వాగు కరకట్ట మొత్తాన్ని తెలుగు దేశంపార్టీ నాయకులు తవ్వేసి జేబులు నింపుకొన్నారని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోనంకి గ్రామంలోని పిల్లేరు వాగు కరపట్ట ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీడీపీ నేతలు చేస్తున్న అభివృద్ధి తెలియాలంటే కోనంకి గ్రామంలోని పిల్లేరు వాగును చూస్తే తెలుస్తుందని ఎద్దేవా చేశారు. 60 సంవత్సరాల క్రితం పిల్లేరు వాగు పొంగి అస్తవ్యస్తం అయితే అప్పటి గ్రామ పెద్దలు కలిసి కరకట్టను నిర్మించుకున్నారన్నారు. గత 60 సంవత్సరాల నుంచి ఏ ప్రభుత్వం వచ్చినా పిల్లేరు వాగు కరకట్ట జోలికి పోలేదన్నారు. అయితే ప్రస్తుత కూటమి నేతలు ఇప్పుడు మట్టి అమ్ముకోవటానికి కరకట్టను మొత్తం తవ్వేస్తున్నారు. రేపు బాగా వర్షాలు పడి వాగు పొంగి ఊరి మీద పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రుని రామిరెడ్డి, మాజీ ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ గాదె తిరపతి రెడ్డి, ఏవీ కృష్ణారెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు' బకాయిలు సత్వరం విడుదల చేయాలి

ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన



నిరసన వ్యక్తంచేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

నరసరావుపేట: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మేకపోతుల నాగేశ్వరావు, వేపూరి మధు డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ పల్నాడు జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులతో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పెద్దలు అధికారంలోకి రాకముందు యువగళం పాదయాత్ర, ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకి హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తూతూ మంత్రంగా కేవలం రూ.600 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. బడ్జెట్ సమావేశాల నాటికి ఈ రాష్ట్రంలో రూ.3900కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ఆ సమావేశాల్లో ప్రభుత్వం రూ.2600కోట్ల కేటాయించిందని, అయితే ఇంతవరకు ఒక్క విద్యార్థికి ఒక రూపాయి విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని ఫీజులు చెల్లించలేక కళాశాలల్లోనే సర్టిఫికెట్లు ఉంచి ఉన్నత విద్య చదవలేక విద్యార్థులు నరకయాతన పడుతున్నారన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లను విడుదల చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల పీజీ విద్యకు అడ్డంకిగా మారిన జీఓ నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్‌ఓ ఏకా మురళికి వినతిపత్రం అందజేశారు. జిల్లా సభ్యులు మేకపోతుల హర్ష, దాసరి హేమంత్ కుమార్, బత్తుల నాగ నిఖిల్, జాన్సన్ బాబు, రేఖ రాజేష్, షైక్ సమీర్ బాషా, నాయుడు సాయి శ్రీనాథ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఆడబిడ్డలకు అన్యాయం

- గిరిజన మహిళనైన తనపై చిలకలూరిపేట సీఐ అమానుషంగా ప్రవర్తించాడు
- సీఐపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి, ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- టీడీపీ చిలకలూరిపేట క్రియాశీల కార్యకర్త శిరీషాబాయి



నరసరావుపేటటౌన్: ఆడబిడ్డల జోలికి వస్తే ఎవరినైనా విడిచిపెట్టే ప్రసక్తేలేదని చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లు తనకు జరిగిన అన్యాయంపై మౌనం వహించారని, కూటమి ప్రభుత్వంలో ఆ పార్టీ కార్యకర్తకే న్యాయం జరగక పోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని తెలుగుదేశం పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ క్రియాశీల కార్యకర్త శిరీషాబాయి వాపోయారు. చిలకలూరిపేట సీఐ పై చర్యలు తీసుకోవాలని నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావును కలిసిన ఆమె శనివారం డీఎస్పీ కార్యాలయం ఎదుట విలేకర్లతో మాట్లాడారు. జూన్ 14వ తేదీన చిలకలూరిపేట పట్టణంలోని ఓ మార్ట్‌లో పనిచేసే స్వాతి బాయికి, అక్కడకు వచ్చిన న్యాయవాది వేణుకు మధ్య వివాదం చోటుచేసుకుందని, దీంతో స్వాతిబాయిను విచారించేందుకు పోలీసులు చిలకలూరిపేట పట్టణ స్టేషన్‌కు ఆమెను తీసుకువెళ్లారన్నారు. విషయం తెలుసుకున్న తాను స్టేషన్‌కు వెళ్లానన్నారు. ఆ సమయంలో స్వాతి బాయిను ఇద్దరు యువకుల మధ్యలో కింద నేల మీద కూర్చోబెట్టి ఉండటాన్ని గమనించిన తాను పోలీసులను ప్రశ్నించానన్నారు.

సినిమా వేషాలు ఇక్కడ కాదంటూ అవహేళన..

సీఐ రమేష్ తనను తీవ్రంగా అవమానించి, ఇష్టం వచ్చినట్టు దూషించాడన్నారు. సినిమాల్లో నటిస్తావంట కదా.. నీ వేషాలు ఇక్కడ కాదని సీఐ అవహేళన చేస్తూ మాట్లాడాడని ఆమె వాపోయారు. సినిమాల్లో చేసే బ్రోకర్ పనులు ఇక్కడ చేయొద్దంటూ అసహ్యంగా మాట్లాడాడని తెలిపారు. మహిళనైన తనను సీఐ అవమానకరంగా మాట్లాడారని వాపోయారు. గిరిజన మహిళా నాయకురాలిగా స్టేషన్‌కు వెళ్తే పోలీసులు ఇచ్చే మర్యాద ఇదేనా అని శిరీషాబాయి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై హోం మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు ఆడబిడ్డల జోలికొస్తే వదలమని చెప్తుకొస్తున్నారని.. మరి తనకు న్యాయం ఎప్పుడు చేస్తారో చెప్పాలని కోరారు. టీడీపీ ప్రభుత్వంలో న్యాయం జరగకపోతే కార్యకర్తగా బతికి ఉండి కూడా అనవసరమేనని ఆమె వాపోయారు. సీఐపై చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీకు ఫిర్యాదు చేసి నెల అవుతున్నా ప్రయోజనం లేదని తెలిపారు. ప్రభుత్వం తనకు జరిగిన అన్యాయంపై ఇదే ఉదాసీనతతో ఉంటే న్యాయ పోరాటం చేస్తానని ఆమె హెచ్చరించారు.